క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరామర్శ



యన్నమని శ్రీరామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జగ్గిరెడ్డి

కడియం: మండలంలోని దుళ్ల గ్రామానికి చెందిన యన్నమని శ్రీరామ్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆయన కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. తొలుత శ్రీరామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. శ్రీరామ్ బావ, అంకంపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గంగారామ్ చౌదరితో పాటు, తండ్రి యన్నమని లక్ష్మణరావు తదితరులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జగ్గిరెడ్డి వెంట దుళ్ల ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ తోకల వీరవెంకట్రావు, నాయకులు కంటిపూడి సాయి తదితరులు ఉన్నారు.

మూడు సొసైటీలకు త్రీమెన్ కమిటీలు

కడియం: మండలంలోని కడియం, వేమగిరి, కడియపులంక సొసైటీలకు ప్రభుత్వం త్రీమెన్ కమిటీలను నియమించింది. కడియం సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా వెలుగుబంటి రఘురామ్(నాని), సభ్యులుగా ముద్రగడ సుధ, టి.వరహాలరాజు నియమితులయ్యారు. కడియపులంక త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా గట్టి నరసయ్య, సభ్యులుగా కొటికలపూడి వేంకటేశ్వరరావు, అంజూరి వెంకటరామారావును నియమించారు. అలాగే వేమగిరి సొసైటీ చైర్మన్‌గా వెలుగుబంటి వెంకటాచలం, సభ్యులుగా పుల్లెపు వెంకటరమణమూర్తి, పితాని శివరామకృష్ణ నియమితులయ్యారు.

'విజయ శంకర' పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసశర్మ



సీటీఆర్ఐ: విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన మండపాక నాగలక్ష్మి పదోన్నతిపై విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో కూచిపూడి నృత్య సహోపన్యాసకులు పసుమర్తి శ్రీనివాసశర్మ పాఠశాల ప్రిన్సిపాల్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 33 ఏళ్లుగా అసిస్టెంట్ లెక్చరర్‌గా ఇక్కడ పని చేశారు. నాట్యంలో పది పుస్తకాలు రాశారు. ఐదుసార్లు విదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. 2014లో ఉత్తమ అధ్యాపక పురస్కారం పొందారు. పలు బిరుదులతో పాటు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, జర్మనీ ప్రభుత్వం నుంచి అవార్డు పొందారు.

సమాజానికి పట్టాభిరామ్ సేవలు అమోఘం

రాజమహేంద్రవరం సిటీ: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఇంద్రజాలికుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్ సమాజానికి చేసిన సేవ అద్వితీయమని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం స్థానిక ప్రకాశంనగర్‌లోని బుక్ బ్యాంకులో డాక్టర్ పట్టాభిరామ్ సంస్మరణ సభ జరిగింది. తొలుత డాక్టర్ పట్టాభిరామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. చేతబడి, బాణామతి వంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, మూఢ నమ్మకాల నివారణకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, డాక్టర్ కర్రి రామారెడ్డి, ఎర్రాప్రగడ రామకృష్ణ, డాక్టర్ అరిపిరాల నారాయణరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ టి.పతంజలిశాస్త్రి, అశోక్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బొమ్మూరులోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో బుధవారం ఉమ్మడి జిల్లాస్థాయి చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ క్లస్టర్ స్థాయి విజేతలలో 6 పాఠశాలల నుంచి 11 మంది పెయింటింగ్ పోటీలకు, 12 మంది వ్యాసరచన పోటీలకు హాజరయ్యారు. వీరిలో తొలి మూడు స్థానాలకు ఎంపికైన వారికి ఈ నెల 11న డైట్‌లో నిర్వహించే ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో బహుమతీ ప్రదానం చేస్తారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పీపీఎస్ జోగన్నశాస్త్రి, ఆర్‌సీహెచ్ నాగేశ్వరరావు వ్యవహరించారు. లెక్చరర్లు సూర్యనారాయణ, చూడామణి, రాజేష్, జిలానీ బాషా, సుగుణ, శిరీష, కృష్ణసాయి పాల్గొన్నారు.

గురుదేవోభవ

- అజ్ఞానాంధకారాన్ని తొలగించే వాడే గురువు
- సాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- నేడు గురుపౌర్ణమికి నగరంలో సన్నాహాలు

సీటీఆర్ఐ: జగద్గురు శబ్దం ముగ్గురు మహనీయులకు అన్వయించుకోవడం పరిపాటి. 'కృష్ణం వందే జగద్గురుమ్' అర్జునుని నిమిత్తంగా చేసుకుని గీతామృతాన్ని లోకానికి పంచిన కృష్ణపరమాత్మ తొలి జగద్గురువు. 'వ్యాసాయ విష్ణురూపాయ' అని కీర్తించబడ్డ వ్యాసభగవానుడు రెండో జగద్గురువు. సనాతనధర్మం, వైదికప్రాబల్యం శిథిలావస్థకు చేరుతున్న తరుణంలో వైదికమతానికి ఊపిరులూదిన ఆదిశంకరులునూ జగద్గురువుగా కీర్తించారు.

వ్యాసపౌర్ణమియే గురుపౌర్ణమి

వ్యాసభగవానుడు అవతరించిన ఆషాఢ పూర్ణమి గురుపౌర్ణమిగా వినుతికెక్కింది. వ్యాస పౌర్ణమి ఉత్సవాలను నగరమంతటా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. గోదావరి గట్టున ఉన్న శృంగేరీ శంకర మఠంలో అర్చకుడు వెలవలపల్లి తాతయ్యశాస్త్రి పర్యవేక్షణలో గురుపాదుకార్చన, చంద్రమౌళీశ్వరునికి అభిషేకాలు, శారదాదేవికి విశేష అర్చనలు జరగనున్నాయి. ఆధునిక సమాజంలో సాయినాథుడు కూడా సమర్థ సద్గురువుగా కీర్తించబడుతుండటంతో, అన్ని సాయి మందిరాల్లో విష్ణుసహస్ర నామ పారాయణలు జరగనున్నాయి. రాజమహేంద్రవరం శివారున శ్రీమహాలక్ష్మీ సమేత చిన్నవేంకటేశ్వరస్వామి పీఠంలో మహాలక్ష్మీదేవికి వంద కిలోల గంధంతో అభిషేకం జరుగుతుందని పీఠాధిపతి చిన్న వేంకన్నబాబు తెలిపారు. కొంతమూరు శ్రీవల్లభ గణపతి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరుగుతాయి.



గోదావరి గట్టున శృంగేరీ శంకర మఠంలో ఆదిశంకరాచార్యులుకు చేస్తున్న పూజలు (ఫైల్)

గురువుపై భక్తిప్రపత్తులు ఉండాలి



పంచమ వేదం భారతాన్ని, భాగవతాది అష్టాదశ పురాణాలను, ఉప పురాణాలను, ధర్మనిష్ఠతో జగత్తుకు అందించిన జగద్గురువు వ్యాసభగవానుడు. అజ్ఞానపు చీకట్లను పారదోలిన జ్ఞానభాస్కరుడు ఆయన. గురుపౌర్ణమి నాడు జ్ఞానభిక్షను అనుగ్రహించిన వ్యాసభగవానుని పూజించి, ఆయనపై భక్తిప్రపత్తులను చాటుకోవాలి.

– రాజనాల రాజేశ్వరి, సంస్కృత అధ్యాపకురాలు, ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల

ఆధ్యాత్మిక మార్గంలో నడిపేవారే..



ప్రతి ఒక్కరినీ ఆధ్యాత్మిక మార్గంలో నడిపించే వారే గురువులు. సనాతన ధర్మానికి భగవానుడైన నారాయణుడు ఆది గురువని, ఆయన నుంచి ఆదిశంకరాచార్యులు వరకు గురుపరంపరగా సనాతన వేద ధర్మాన్ని స్వీకరించారు. గురువు తన జ్ఞాన మహత్యంతో, భాషను అనుగ్రహంతో విద్యార్థులకు జ్ఞాన దానం చేస్తాడు.

– డాక్టర్, బీవీ తిరుపణ్యం, ప్రిన్సిపాల్, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆదర్శ జీవితానికి ముఖ్యం



మానవ జన్మ ఎంతో ఉత్తమమైనది. అట్టి జన్మను సార్థకం చేసుకోవడానికి, బతకడానికి తిండి, కట్టుకోవడానికి వస్త్రం, ఉండటానికి ఇల్లు ఎంత ముఖ్యమో, ఆదర్శప్రాయమైన జీవితానికి గురువు అంతే ముఖ్యం.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, తెలుగు శాఖాధిపతి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సార్వత్రిక సమ్మె సక్సెస్



ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న క్లాస్-3, 4 ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: కార్మికుల హక్కులను హరించే కొత్త లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం అయ్యిందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ అన్నారు. స్థానిక మోరంపూడి జంక్షన్‌లో ఉన్న ఎల్ఐసీ రాజమహేంద్రవరం డివిజనల్ ఆఫీసు వద్ద అఖిల భారతీయ బీమా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెలో భాగంగా నిరసన ప్రదర్శన పెద్ద ఎత్తున జరిగింది. కోదండరామ్ మాట్లాడుతూ జీవిత బీమా, ఆరోగ్య బీమాలపై ప్రజలకు భారంగా పరిణమించిన జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ ఇన్సూరెన్స్ సంస్థలను, బ్యాంక్‌లను కాపాడాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లను రద్దు చేసి, ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న క్లాస్ 3, 4 ఉద్యోగుల శాశ్వత నియామకాలు చేపట్టాలని, 1995 పెన్షన్ పథకం వర్తింప చేయాలని, ఎల్ఐసీలో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు ట్రేడ్ యూనియన్‌గా గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు ఎస్ఆర్ జె మాథ్యూస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని కోరారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.గన్నెయ్య, ఓబీసీ ఉద్యోగుల సంఘం సంయుక్త కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, ఏజెంట్ అసోసియేషన్ నాయకులు విశ్వేశ్వరరావు, చంద్రశేఖర్, క్లాస్- 1 అధికారుల సంఘం అధ్యక్షుడు వీర కిషోర్, విశ్రాంత ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు రఘునాథరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. యూనియన్ నాయకులు ఏ.సుబ్బారావు, సత్యదేవ, పీఎస్ ఎన్ రాజు, ఈశ్వరరావు, బి.శ్రీనివాసరావు, మహిళా కన్వీనర్ శిరీష, రాజ్యం పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం

- సార్వత్రిక సమ్మెలో నేతల హెచ్చరిక
- కేంద్ర కార్మిక సంఘాల భారీ ర్యాలీ



రాజమండ్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రకాశం నగర్: కేంద్రం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని ఏఐటీయూసీ నాయకులు తాటిపాక మధు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.అరుణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు టీకే విశ్వేశ్వరరెడ్డి హెచ్చరించారు. బుధవారం కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ మహా ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని కోటిపల్లి బస్టాండ్ నుంచి శ్యామలా థియేటర్ సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా కోటగుమ్మం వరకు నిరసన ర్యాలీ కొనసాగింది. అనంతరం కోటగుమ్మం సెంటర్ వద్ద నిర్వహించిన సభలో మధు మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ ప్రభుత్వం బడా కార్పొరేట్ వ్యక్తుల మేలు కోసమే ఈ లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అరుణ్ మాట్లాడుతూ, లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 25 కోట్లకు పైగా కార్మికులు ఈ సమ్మెలో భాగస్వాములైనట్టు తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మూర్తి, పూర్ణిమ రాజు, బేబీరాణి, ఏఐటీయూసీ నాయకులు రాంబాబు, రెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో..

లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ భవన నిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గోకవరం బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ, కార్యదర్శి శ్రీనివాస్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు .

ఆకతాయిలతో వేగలేకపోతున్నాం

డీఎస్పీకి దుళ్ల గ్రామస్తుల మొర



ఆకతాయిలు చేరే ప్రాంతాన్ని డీఎస్పీకి చూపుతున్న గ్రామస్తులు

కడియం: సాయంత్రం ఆరు దాటితే దుళ్ల పంచాయతీ వెనుకవైపున ఆలయాల వద్ద ఆకతాయిల ఆగడాలతో వేగలేకపోతున్నామని, బహిరంగంగానే మద్యం, గంజాయి సేవిస్తూ భయాందోళన కలిగిస్తున్నారని పలువురు గ్రామస్తులు దక్షిణ మండలం డీఎస్పీ భవ్యకిశోర్‌కు మొరపెట్టుకున్నారు. బుధవారం మండలంలోని దుళ్ల పంచాయతీ కార్యాలయం వద్ద సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరైన గ్రామస్తులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను డీఎస్పీ ముందు ఏకరువు పెట్టారు. గంజాయి వినియోగం పెరిగిపోయిందని, కొందరు యువకులు, చిన్నపిల్లలకు సైతం అలవాటు చేస్తున్నారని చెప్పారు. పంచాయతీ వెనుక ఆలయాల వద్ద బహిరంగంగా మద్యం సేవించి, సీసాలు అక్కడే పడేస్తున్నారని తెలిపారు. నిత్యం సాయంత్రం ఆరుదాటితే పెద్దఎత్తున ఆకతాయిలు ఇక్కడకు చేరుతున్నారన్నారు. దీంతో వెంటనే గస్తీ ఏర్పాటు చేసి, తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని డీఎస్పీ ఆదేశించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

అంతకు ముందు జరిగిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా మోసాలకు గురికాకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా 112 నంబర్‌కు ఫోన్ చేస్తే, తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వేంకటేశ్వరరావు, ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, నాయకులు ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, కంటిపూడి శ్రీనివాస్, చిట్టూరి అమ్మిరాజు, పత్తి ప్రకాష్, కాయల సత్యనారాయణ, సిద్దిన త్రివేణి, చింతా శ్రీనివాస్, కులపాకుల సత్తిబాబు, మహిళా పోలీసు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కోనేరు మురళికి పలువురి పరామర్శ



కోనేరు సుష్మంత్ వెంకట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆకుల వీర్రాజు, ఇతర నాయకులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పుత్ర వియోగంతో బాధపడుతున్న నగర ప్రముఖుడు కోనేరు మురళిని బుధవారం పలువురు పరామర్శించారు. ఇటీవల ఆయన తనయుడు కోనేరు సుష్మంత్ వెంకట్ మరణించిన విషయం తెలిసిందే. సుష్మంత్ చిత్రపటానికి జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోనేరు మురళిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి, మాజీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పాలసానిపల్లి హనుమంతరావు, కిర్లంపూడి టీడీపీ నాయకులు చదరం చంటి, బీజేపీ నాయకులు నీరుకొండ వీరన్నచౌదరి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సీహెచ్‌సీల సందర్శన

కడియం: జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎస్.వసుంధర దామిరెడ్డిపల్లి, కడియపు సావరం, కడియం సీహెచ్‌సీలను బుధవారం సందర్శించారు. దామిరెడ్డిపల్లి, కడియపు సావరం గ్రామాల్లో జరుగుతున్న ఇంటెన్సిఫైడ్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రాంను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కడియం సెంటర్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ట్రూనాట్ ల్యాబ్ పనితీరును పర్యవేక్షించారు. ఆమె వెంట స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.

వైభవంగా అక్కమ్మ తల్లి జాతర ప్రారంభం



జ్యోతులు, పూలఘటాలతో వస్తున్న భక్తులు



కొండపై నుంచి అక్కమ్మ తల్లి వారిని కిందకు తీసుకొస్తున్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ గ్రామ దేవత కొండమీద కొలువైన గురజాల అక్కమ్మతల్లి 34వ జాతర మహోత్సవాలు బుధవారం సాయంత్రం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. గరగ నృత్యాలు, కోలాట నృత్యాలతో కొండపై నుంచి జ్యోతులతో అమ్మవారిని 108 పూల ఘటాలతో కింద ఉన్న బస్టాండ్ సెంటర్‌కు తీసుకువచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అభ్యుదయ యువజన సంఘం సభ్యులు, భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

రైతులు పంట బీమా చేయించుకోవాలి



బీమా పథకం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న భీమరాజు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఖరీఫ్ సీజన్‌కు అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ జనరల్ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ సంజయ్ సూచించారు. బుధవారం రాజవోలు గ్రామంలో ఎంఏఓ ఎ.భీమరాజు అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వరికి ఎకరాకు రూ.576.92 బీమా చెల్లించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ఆగస్టు 15లోపు బీమా చేయించుకోవాలన్నారు. మినుము పంటకు ఎకరానికి రూ.303.64 చొప్పున, ఈ నెల 31లోగా బీమా చేయించాలని తెలిపారు. భీమరాజు మాట్లాడుతూ, రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచారం, పరిజ్ఞానాన్ని చేరువ చేయడం వల్ల వారికి మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల హిస్టరీస్ అధికారి గణేశ్వరరావు, వ్యవసాయ సహాయకుడు కె.దుర్గబాబు, రైతులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో 8 మంది కార్యదర్శులు

దుళ్ల పంచాయతీ రికార్డు!



సత్యానంద్, దుళ్ల పంచాయతీ కార్యదర్శి

కడియం: సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు రెండేళ్లకో, ఐదేళ్లకో జరుగుతుంటాయి. పంచాయతీ కార్యదర్శులకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. కానీ కడియం మండలం దుళ్ల గ్రామ పంచాయతీకి మాత్రం నాలుగేళ్ల కాలంలో 8 మంది కార్యదర్శులు మారారు. ప్రస్తుత బదిలీల్లో 8వ కార్యదర్శిగా బి.సత్యానంద్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనపర్తి మండలం మహేంద్రవాడ పంచాయతీ నుంచి బదిలీపై దుళ్లకు వచ్చారు. ఈయనకు ముందు బి.శిరీష, సరోజారాణి, శ్రీనివాసరెడ్డి, విజయరాజు, వీడీవీ లక్ష్మి, మహేష్, రవికిషోర్ ఇక్కడ కార్యదర్శులు పనిచేశారు. వీరందరూ తమకు తాముగా బదిలీపై వెళ్లిపోవడం గానీ, ఇక్కడి నాయకులు, ప్రజాప్రతినిధులకు నచ్చక వారిని పంపించి వేయడం జరిగింది. వచ్చిన అధికారి గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టే లోపు వారు బదిలీపై వెళ్లిపోవడంతో గ్రామంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల వ్యవధిలోనే అధికారులు మారిపోతుండడంతో చిన్న పనులకు సైతం ప్రజలు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇటీవల సచివాలయ ఉద్యోగుల బదిలీల సమయంలో సైతం రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడంతో, సర్వీస్ రిజిస్టర్ వివరాలతో పాటు, ఇతర లాంఛనాలను పూర్తి చేయడానికి వేచిచూడాల్సిన పరిస్థితి ఎదురైంది. దీంతో ఇక్కడ రిలీవ్ కావడం, మరోచోట పోస్టింగ్‌కు రిపోర్టు చేయడంలో ఆలస్యమైందని పలువురు సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్య, తాగునీరు తదితర పనుల పర్యవేక్షణే కష్టంగా మారిన నేపథ్యంలో, తరచూ ఉద్యోగులు మారిపోతుండడంతో శాశ్వత అభివృద్ధి పనులు ఎప్పుడు జరుగుతాయని గ్రామస్తులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం తగదు



శిక్షణకు హాజరైన బీఎల్‌వోలతో సరళవందనం, ఇతర అధికారులు

నియోజకవర్గ ఎన్నికల అధికారి సరళవందనం

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల విధుల్లో బూత్ లెవెల్ అధికారులు అలసత్వం వహించవద్దని రాజమండ్రి రూరల్ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, పోలవరం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.సరళవందనం తెలిపారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎన్నికల సంఘం, ఇండియా ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ అధికారుల శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సరళవందనం మాట్లాడుతూ, బీఎల్‌వోలు అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రతి రోజు ఓటు నమోదు, తీసివేత, మార్పులు చేసుకోవచ్చన్నారు. శిక్షణా తరగతులు ఈ నెల 17 వరకు కొనసాగుతాయన్నారు. బీఎల్‌వోలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ అంశాలను వివరించారు. రూరల్ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ చైతన్య, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురు, శుక్రవారాల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ బుధవారం వెల్లడించారు. గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు తుమ్మలావ, ఆర్యాపురం, కృష్ణానగర్, కొత్తరోడ్డు, స్వతంత్ర ఆసుపత్రి ఏరియాల్లో అంతరాయం ఉంటుందన్నారు. శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్, గోరక్షణ పేట, అంబేడ్కర్ నగర్, రెల్లిపేట, గాంధీపురం–3 తదితర ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందన్నారు. కొత్త లైన్ నిర్మాణం కోసం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు వెంకటేశ్వరనగర్, స్వరూపనగర్, విద్యుత్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, చెరుకూరి ఫంక్షన్ హాల్ రోడ్, గోలీ రామారావు వీధి, వాకర్స్ పార్క్ రోడ్డు, సత్యవతి హోటల్ రోడ్డు, మహాలక్ష్మి టెంపుల్, కోదండ రామాలయం, వాకర్స్ రోడ్, జేఎన్ రోడ్, సుక్షేత్ర అపార్ట్‌మెంట్స్, ఏవీ అప్పారావు రోడ్, శ్రీవేంకటేశ్వర స్వామి టెంపుల్, బాలాజీ స్ట్రీట్, అద్దేపల్లి కాలనీ, షీలానగర్, శ్రీనివాసా గార్డెన్స్, శ్రీనివాసనగర్, కోకా భాస్కర్ నగర్, జయశ్రీ గార్డెన్, పిల్లివారి వీధి, మంతెన గార్డెన్స్, షిర్డీసాయి మార్గ్, తోటరాములు నగర్, అద్దేపల్లి కాలనీ, సాయినేతాజీ టవర్స్, శారదా నగర్, గోపాలనగర్ పుంత, విద్యుత్ కాలనీ పరిసర ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందని వివరించారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు కొంతమూరులోని నూకాలమ్మ గుడి, ముస్లింపేట, అఫీషియల్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, బ్రాహ్మణ అగ్రహారం, బీసీ కాలనీ, కాతేరులోని బ్రాహ్మణ అగ్రహారం, రాయడుపాకలు, కొలమూరు, కొంతమూరులోని పరిమినగర్, బొమ్మన కాలనీ, ఫోర్త్ బ్రిడ్జి ప్రాంతం, సాయిరాం కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.